

## సమస్యలు పరిష్కారం ద్వారా అధిక స్థానాల్లో గెలవాలి

- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు.

3లో

Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 139
సంచిక : 251
పేజీలు : 3
మంగళవారం, జూన్ 02, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

# చేపల కోసం చెరువులో నీళ్ల లూటీ

## గుత్తేదారునికి మద్దతుగా అధికారులు..?

**టి మీడియా, జూన్ 1, కురవి:** వేసవి కాలంలో తీవ్ర ఎండలు కొనసాగుతున్న నేపథ్యంలో చెరువుల్లో నిల్వ ఉన్న నీటిని చేపల వేట కోసం తొలగిస్తు నీళ్ల లూటీ..చర్యలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. చేపల గుత్తేదారుల ప్రయోజనాల కోసం చెరువు నీటిని బయటకు వదులుతుండగా, సంబంధిత అధికారులు మద్దతుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్థానిక రైతులు మౌనం పాటిస్తుండటం గమనార్హంగా మారింది.

**నీటి మట్టం మరింత తగ్గే ప్రమాదం**

ప్రస్తుతం మండుతున్న ఎండల కారణంగా భూగర్భ జలాలు ఇప్పటికే అడుగంటుతున్న పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో చెరువుల్లో ఉన్న నీటిని పూర్తిగా తొలగిస్తే పరిసర ప్రాంతాల్లో బోర్లు, బావులలో నీటి మట్టం మరింత తగ్గే ప్రమాదం ఉందని గ్రామస్తులు
ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**తాగునీటి సమస్యలు**

అయితే ప్రస్తుతం చేపల వేట పేరుతో నీటిని తొలగించడం వల్ల భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశముందని ప్రజలు పేర్కొంటున్నారు. అలాగే గ్రామాల్లో పశువుల సంఖ్య అధికంగా ఉండటంతో వాటికి తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. వేసవి కాలంలో చెరువులే పశువులకు ప్రధాన నీటి వనరులు కావడంతో నీటి తొలగింపు ప్రభావం తీవ్రంగా ఉండొచ్చని చెబుతున్నారు. వరి కోతలు పూర్తయిన చెరువులో నీటిని తొలగించడం కొనసాగిస్తూనే ఉన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ప్రశ్నతలేతుతున్నది. చెరువుల్లో కనీస నీటి మట్టాన్ని కొనసాగించేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

**టీ మీడియా, జూన్1,భద్రాద్రి కొత్తగూడెం :** ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, డి ఆర్ ఓ పద్మావతి తో కలసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సమగ్రంగా పరిశీలించారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వెంటనే

మిగతా 3లో

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- కలెక్టర్ స్నేహ శబరీష్

**టి మీడియా , జూన్ 1, మహబూబాబాద్:** మహబూబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, అదనపు కలెక్టర్ (ఇంచార్జ్ స్థానిక సంస్థల) పురుషోత్తం పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా వినతులను స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్ మరియు (ఇంచార్జ్) పురుషోత్తం పర్యవేక్షణలో, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్



పేర్కొన్నారు. జూన్ 02న జరుపు తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, వచ్చిన అతిథులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మంచినీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, మరియువివిధప్రభుత్వపథకాలకుసంబంధించి నవినతులుఎక్కువగానమోదయాయని,మహబూబాబాద్ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆహ్వానము

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం

తేది. 02-06-2026 మంగళవారం నాడు

జాతీయ పతాకావిష్కరణ

ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నందు జరుగును.

కావున

ఈ కార్యక్రమమునకు తమరిని సాదరముగా ఆహ్వానించనైనది.

కార్యక్రమ వివరములు :

స్థలం : పోలీస్ పరేడ్ గ్రౌండ్స్, ఖమ్మం
సమయం : ఉ॥ గం॥ 8.00 ని॥ లకు
పతాకావిష్కరణ : గౌ॥ శ్రీ భట్టివిక్రమార్క మల్లు గారు, ఉప ముఖ్యమంత్రి గౌరవ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక మరియు విద్యుత్ శాఖామాత్యులు గారిచే
ఉ॥ గం॥ 8.10 ని॥లకు : గౌ॥ ఉపముఖ్యమంత్రివర్యుల గారిచే ప్రసంగం
ఉ॥ గం॥ 8.30 ని॥లకు : సాంస్కృతిక కార్యక్రమములు
ఉ॥ గం॥ 8.50 ని॥లకు : స్టాళ్ళ సందర్శన, శకటాల ప్రదర్శన

కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్
ఖమ్మం.



## వినతులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**టీ మీడియా, జూన్1, ఖమ్మం:**ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కామేపల్లి మండలం సాతాని గూడెం గ్రామానికి చెందిన కన్నేటీ రంగయ్య ముచ్చర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 255, 262లో ఆరు ఎకరాల 20 గుంటలు వ్యవసాయ సాగు భూమి ఉందని, ఈ పొలంలోకి వెళ్ళుటకు దారి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామానికి చెందిన ఎం.వెన్నెల తనకు తల్లి తండ్రులు లేరని, 10వ తరగతి ఉత్తీర్ణత 493 మార్కులతో సాధించడం జరిగిందని, తనకు ఎం.పి.హెచ్.డబ్ల్యూ లో సీట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్.సి.ఓ బీసీ సంక్షేమ శాఖకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కార్మికులకు అందించే ప్రసూతి ఆర్థిక సహాయం తనకు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, లేబర్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




## పోలవరం బ్యాక్ వాటర్‌ను నిపుణులతో సర్వే జరిపించాలి : రేగా

**టీ మీడియా, జూన్1, కొత్తగూడెం**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న ప్రాంతాల సర్వే నిపుణుల కమిటీ సర్వేలో లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేయాలని, ఈనెల 3, 4 తేదీలలో పర్యటించనున్న "పోలవరం ప్రాజెక్టు అథారిటీ కమిటీ సర్వే" రహస్యంగా చేస్తే సహించేది లేదని, ముంపు ప్రాంతాల ప్రజల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం, బూర్గంపాడు, భద్రాచలం మండలాలకు పెద్ద ఎత్తున ముంపు పొంచి ఉన్నదని తెలిపారు. ముంపు ప్రాంత పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజల రక్షణ కోసం పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన "పోలవరం ప్రాజెక్టు అథారిటీ కమిటీ" ఈనెల 3, 4 తేదీల్లో ముంపు ప్రాంతాలలో పర్యటించి, అక్కడ ప్రజలకు, ఆ ప్రాంతానికి కలిగే నష్టాన్ని నివేదిక తయారు చేయాలని డిమాండ్ చేశారు. గుట్టు చప్పుడు కాకుండా నివేదికలు తయారు చేసి, ఇక్కడ ప్రాంత ప్రజలకు నష్టం కలిగించే విధంగా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బ్యాక్ వాటర్ విషయంలో సాంకేతిక లోపాలు ఉన్నాయని అన్నారు. భద్రాచలంకు 1986, 1990, 2022 సంవత్సరాలలో గోదావరికి వచ్చిన వరద ముంపును బట్టి చూస్తే, భవిష్యత్తులో పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వలన తను ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎల్ వాటర్ రిజర్వ్ చేయడం వలన మొర్రేడు, కిన్నెరసాని వాటర్ పైకి ఎగతన్ని పంట పొలాలు, ఆ ప్రాంత ప్రజలకు భారీ నష్టం జరుగుతుందని తెలిపారు. శాస్త్రీయ బద్ధంగా బ్యాక్ వాటర్ విషయంలో పరిశోధన జరగాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా సర్వే చేస్తే భద్రాచలం సీతారామ దేవాలయం, ఈ ప్రాంత ప్రజలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముంపు ప్రాంత ప్రజలకు ఆంధ్రప్రదేశ్ లో ఇచ్చినట్టుగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో అంతర్జాతీయ కమిటీ ఒకటి ఏర్పాటు చేసి, శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఎస్. మల్లిక



**టీ మీడియా, జూన్ 1, ముదిగొండ :**పట్టుదల ఉంటే సాధ్యం కానిదేది ఉండదని నిరూపించారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిక.ఇటీవల జరిగిన ప్రమోషన్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ముదిగొండ ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొందిన ఎస్. మల్లికను ముదిగొండ ఎంపీడీవో విజయ ఘనంగా సన్మానించారు. పుట్టుకతో అంధురాలైనప్పటికీ బ్రెయిలీ లిపి ద్వారా చదువుకొని జూనియర్ అసిస్టెంట్ గా ప్రభుత్వ ఉద్యోగం సాధించి అంచలంచలుగా ఎదుగుతూ ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొందడం విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు.

### ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేద్దాం

ప్రభుత్వ కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకులు మరియు నాణ్యమైన విద్య లభిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేలకొండపల్లి అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ యన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేలకొండపల్లి నందు డాక్టరేట్ పొందిన అధ్యాపకుల చేత బోధన జరుగుతుందని మరియు అత్యాధునిక ప్రయోగశాలలు, బాలురకు మరియు బాలికలకు విడివిడిగా కళాశాల ఆవరణలోనే హాస్టల్ సదుపాయం కలదని, ఈ ప్రాంత విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ముదిగొండ సర్పంచ్ ఉపేందర్ గారు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో విజయ గారిని మరియు ముదిగొండ సర్పంచ్ ఉపేందర్ ని సన్మానించడమైనది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలి

**టీ మీడియా, జూన్1, ములుగు బ్యూరో :**ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని మండల డిప్యూటీ తహసీల్దార్ కి ఎమ్మార్పిస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పిస్ మండల అధ్యక్షులు యాసం రమేష్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతలైన వెంకటాపురం, వాజేడు మండలాలకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలనీ అన్నారు. వెంకటాపురంలో ఎస్సి సంక్షేమ వసతి గృహాలు మూసి వేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత విద్యార్థులకు చదువు కోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దళిత విద్యార్థుల ఆవేదనని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నామని అన్నారు. దళితసామజిక వర్గం అత్యంత వెనకబడి ఉండటంతో విద్య కోసం దూర ప్రాంతాలకి విద్యార్థులను పంపించలేని పరిస్థితి ఉందని అన్నారు. విద్యార్థులు విద్య మధ్యలో ఆపివేసి కూలీలుగా, మారి పోతున్నారని అన్నారు. విద్యాభివృద్ధి కోసం ఏజెన్సీ లో ఎస్సి సంక్షేమ గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని అయన అన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లేష్,చిన్నతిరుపతి,ఆనంద్,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ అధికారిగా బొగ్గ నారాయణ బాధ్యతలు



**టీ మీడియా, జూన్1, ములుగు బ్యూరో :**ములుగు జిల్లా వెంకటాపురం మండలకేంద్రంలోని నూతన మండల పంచాయతీ అధికారిగా బొగ్గ నారాయణ, విధుల్లో చేరారు. బొగ్గ నారాయణ, గత పంచాయతీ ఎన్నికల్లో భద్రాచలం మండలంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి( ఫ్యాక్ ) గా బాధ్యతలు నిర్వహించి ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలో మల్టి జోన్ -1 పరిధిలో వెంకటాపురం మండలానికి నూతన మండల పంచాయతీ అధికారిగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంపివో బొగ్గ నారాయణ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులతో, ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో త్రాగు నీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల అమలు, కూలీల వేతనాలు సకాలంలో చెల్లింపు, తదితర అంశాలపైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా చేరవేయడానికి కట్టుబడి ఉంటానని తెలిపారు.

## టెస్టు బుక్ డెవలప్‌మెంట్ కమిటీకి కారేపల్లి ఆధ్యాపకులు



**టీ మీడియా,జూన్01, సింగరేణి (కారేపల్లి):**రాష్ట్ర స్థాయి టెస్ట్ బుక్ డెవలప్‌మెంట్ కమిటీకి కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ్మిశెట్టి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌లు ఎంపికైనారు.కారేపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకులైన తమ్మిశెట్టి శ్రీనివాసరావు చరిత్ర బుక్ డెవలప్‌మెంట్ కమిటీకి, మెకానికల్ ఇంజనీరింగ్ ఒకేషనల్ కమిటీకి దుర్గాప్రసాద్‌లు నియమితులైనారు. ఈ కమిటీలో ప్రోఫెసర్లు, ఆసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. బుక్ కమిటీకి ఎంపికైన అధ్యాపకులు శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌ల ను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.విజయలక్ష్మి, అధ్యాపకులు సోమవారం సన్మానించారు. ఇరువురు మరిన్ని ఉన్నత పదవులు ఆధిరోహించాలని ఆకాంక్షించారు.



## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి

### బానోత్ మనిషా లక్ష్మి

**టీ మీడియా,జూన్01, సింగరేణి (కారేపల్లి):** బిఆర్ఎస్ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి నాయకుడు, కార్యకర్త భాగస్వాములు కావాలని వైరా దివగంత మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ తనయ బానోత్ మనిషాలక్ష్మి కోరారు. సోమవారం కారేపల్లి మండలంలో పర్యటించారు.భాగ్యనగర్‌తండా లో నూతనంగా ఏర్పాటు చేసిన కేకే ఫెర్టిలైజర్ షాపును ఆమె ప్రారంభిచారు. కారేపల్లి లో ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజును పరామర్శించి ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. జిల్లా మైనారిటీ నాయకులు షేక్ గౌసుద్దీన్ ఇంట్లో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక పై నాయకులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీలాల్, నాయకులు డొంకెన రవీందర్, ఇస్లావచ్ సుజాత, జర్పుల హచ్చు, బానోత్ మోహన్, జడల కళ్యాణ్, ధారావత్ వికాస్, బానోత్ రాజేష్, గౌసుద్దీన్ ,మణికొండ నాగేశ్వరరావు, తెలగొర్ల రామారావు, గంగరబోయిన మురళి, పేర్ని వెంకటేశ్వర్లు, పొడుగు హరీష్, రమేష్, మూతి కోటేశ్వరరావు, అజ్మీర రవి, వెంకట్, ఖలీలుల్లాఖాన్, సురేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**టీ మీడియా, జూన్ 1, కూసుమంచి:** పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి తన వద్దకు రావడం లేదని మనస్థాపం చెందిన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకి పాల్పడ్డ సంఘటన మండలంలోని గైగొల్లపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గైగొల్లపల్లి గ్రామానికి చెందిన కోరుట్ల ఉపేందర్ ( 35 ) భార్య తన పుట్టింటికి వెళ్ళింది. తీసుకు వచ్చేందుకు వెళ్లిన ఎంతకీ భార్య తన వద్దకు రాకపోవడంతో ఉపేందర్ మనస్థాపం చెందాడు. దాంతో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి దూలానికి ఉరి వేసుకొని కోరుట్ల ఉపేందర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు మృతుడి తండ్రి కోరుట్ల జీడయ్య ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## గోదావరిలో డీసిల్టింగ్ రద్దు చేయాలని కలెక్టర్ కు వినతి

**టీ మీడియా, జూన్1, ములుగు బ్యూరో :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో యాకన్నగూడెం నుండి ఆలుబాక వరకు గోదావరి నదిలో డీసిల్టింగ్ రద్దు చేయాలని సోమవారం ములుగు జిల్లా కలెక్టర్కి సిపిఎం బృందం ఫిర్యాదు చేసారు . ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతమ్మ బహుళార్ధ సాగర్ గడిచిన నాలుగు సంవత్సరాల క్రితం మూతపడిందని మూలన పడ్డ సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంకటాపురం మండలంలో గోదావరిలో సుమారు నాలుగువేల ఎకరాలకు పైగా గోదావరిలో మూడు కోట్ల క్యూబిక్ మీటర్ల డీసిల్టేషన్ ( పూడికతీత ) ప్రభుత్వం నుండి అనుమతులు పొందేందుకు ఇసుక మాఫియా రంగం సిద్ధం చేసిందని కలెక్టర్ కి వివరించారు . పెద్ద ఎత్తున ఇసుక ర్యాంపులకు కోట్లాది క్యూబిక్ మీటర్ల అనుమతుల ఇస్తే తీవ్ర నష్టం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు జిల్లాలో 56 సొసైటీలను క్రింద ఉన్న గిరిజన పేదల పొట్ట కొట్టేందుకు ఇసుక మాఫియా ముఠాకి ప్రభుత్వం వంతపడే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రత్నం రాజేందర్, రత్నం ప్రవీణ్ , ఎండి గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**టీ మీడియా, జూన్1, ములుగు బ్యూరో :** ములుగు జిల్లా వెంకటాపురంమండలంలోని పాత్రపురం గ్రామపంచాయతీలో గౌరరపు నాగమణి, కాలేష్ దంపతుల నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాత్రపురం గ్రామ సర్పంచ్ బోగ్గుల పుష్పావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవడం సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లో గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొప్పుల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి నక్క శిరీష, వార్డ్ నెంబర్స్ తాటి నాగమణి, రేవతి, పొరిశెట్టి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల రీఓపెనింగ్

**టీ మీడియా, జూన్1, మధిర :** ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిర లో ప్రిన్సిపల్ .శంకర్ ఆధ్వర్యంలో కళాశాల ను గ్రాండ్ గా సెకండ్ ఇయర్ విద్యార్థిని విద్యార్థులతో, కళాశాలను ప్రారంభించినారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా న్యూ సిలబస్ తో బుక్స్ , సీఎం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం పథకం గురించి మన తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని బలహీన వర్గాల కు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలియ చేసినారు. అదేవిధంగా ఈరోజు డిజిటల్ క్లాసులు ప్రిన్సిపల్ గారి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు చేయబడుతున్నటువంటి మరెన్నో మంచి కార్యక్రమాలను మధిర మరియు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు , అధ్యాపకేతర బృందం , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఉన్నారు.



## టిఆర్ఎస్ జెండా పండుగ

**టి మీడియా ,జూన్ 1. అశ్వరావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండల పట్టణ కేంద్రంలో ఈ రోజు తెలంగాణ రక్షణ సేన టి ఆర్ ఎస్ జెండా పండుగ కార్యక్రమం అడ్వకేట్ తెలంగాణ రక్షణ సేన అశ్వరావుపేట నియోజకవర్గం ఇంచార్జ్ సోడెం వెంకట్ ఆధ్వర్యంలో దమ్మపేట జయలక్ష్మీ టాకీస్ సెంటర్ నందు ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు,డి వీరన్న పాల్గొనరు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లకావత్ సురేష్, వి.రవి, కుర్సం రాంబాబు, కుర్సం సతీష్, తాటి కిరణ్, పానుగంటి ప్రసాద్,పూరికే ముత్యాలు, సోడెం సంతోష్,జంగం దినేష్ ,కొల్లు జగదీష్ మారగాని శ్రీనివాసరావు అభిమానులు పాల్గొన్నారు.



## వర్షాకాలం ముందస్తు చర్యలు తీసుకోవాలి

### సమీక్షాసమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవో

**టీ మీడియా,జూన్01, సింగరేణి(కారేపల్లి):** వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ సూచించారు. సోమవారం సింగరేణి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవో లు మాట్లాడుతూ గత ఏడాది వర్షా కాలంలో నీటి ముంపు కు గురై నీరు రోడ్లపై, లో లెవెల్ బ్రిడ్జిలపై ప్రవహించటం,అండర్గ్రౌండ్ బ్రిడ్జి వంటివి 14 ప్రాంతాలను గుర్తించటం జరిగిందన్నారు. పాడుబడ్డ ఇండ్లను గుర్తించి ఆ ఆవాసాలలో ఉండకుండా చైతన్యం తేసి వారిని రీహాబిటేషన్ సెంటర్ కు తరలించాలని కోరారు.వర్షాకాలంలో కరెంట్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్, 11 కేవీ లైన్ల కు దూరంగా ఉండేలా గ్రామస్తులకు సూచనలు చేయాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపరిచి ప్రతి ట్యాంక్లో క్లోరినేషన్ చేయాలని, శానిటేషన్ కు బ్లీచింగ్, సున్నం ప్రతి గ్రామపంచాయితీలో స్టాక్ ఉండాలని కార్యదర్శులను కోరారు. ఈసమావేశంలో పీఆర్ ఏఈ రాజశేఖర్, ఆర్బ్ల్యూఎస్ ఏఈ నరేందర్ రావు, ఐబీ ఏఈ నాగయ్య, హౌసింగ్ ఏఈ నాగేంద్రబాబు, ట్రాన్స్కో ఏఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్గా

## సామ్యూల్ బెన్డిక్ట్. ఇస్రాయిల్ బాధ్యతలు

**టీ మీడియా, జూన్1, మధిర:** మధిర నూతన కమిషనర్ గా ఈరోజు బాధ్యతలు చేపట్టిన శ్రీ సామ్యూల్ బెన్డిక్ట్ ఇస్రాయిల్ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాతను ఇల్లిందలపాడు గ్రామంలో స్వయంగా పూల బొకేతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ కమిషనర్ చైర్పర్సన్ సామినేని సుజాతను మున్సిపాల్టీలో ఉన్న సమస్యలను మరియు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధిర మున్సిపాలిటీలో 15 కోట్ల రూపాయలు నిధులతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అండర్ డ్రైనేజీ వర్కుతో పాటు మధిర మున్సిపాలిటీ లో జరుగుతున్న అనేక కార్యక్రమ వివరాలను చైర్మన్ ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత మధిర మున్సిపాలిటీలో జరిగే ప్రతి కార్యక్రమం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గారి ఆశయాలకు అనుగుణంగా ఉండాలని కోరారు. ఎక్కడ అవినీతికి తావు లేకుండా చూడాలని కోరారు. మున్సిపాలిటీలో జరిగే ప్రతి పని పారదర్శకంగా ఉండాలని కోరారు.దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ మధిర మున్సిపాలిటీ అభివృద్ధిలో తగు పాత్ర పోషిస్తానని చైర్ పర్సన్ కు హామీ ఇచ్చారు.



## దమ్మపేట పాస్టర్ ఫెలోషిప్ శాంతి ర్యాలీ

**టీ మీడియా, జూన్ 1, అశ్వరావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాస్టర్స్ శాంతి ర్యాలీ కృతజ్ఞతలు మరియు అభినందనలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న పాస్టర్స్, క్రైస్తవ నాయకులు మరియు విశ్వాసులు అందరూ వేలాది మందిగా కలిసి పాల్వంచ ప్రధాన కేంద్రంలో శాంతి యుత ర్యాలీ నిర్వహించడం జరిగింది. క్రైఈ కార్యక్రమంలో దమ్మపేట పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ టి. జేమ్స్ ఉపాధ్యక్షులు పాస్టర్ ఎల్.కె. ఏసుపాదం కార్యదర్శి పాస్టర్ వై. కిషోర్ కమిటీ పెద్దలు, అలాగే పొలిటికల్ వింగ్ అధ్యక్షులు పాస్టర్ టి. జేమ్స్ , ఇతర సేవకులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సైన్యం లో ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం



**టిమీడియా ,జూన్ 1, కురవి:** కురవి మండల కేంద్రంలోని ది సోల్జర్స్ డిఫెన్స్ ఇనిస్టిట్యూట్ లో కల్నల్ శ్రీనివాస్ రావు సారధ్యంలో, ఫిజికల్ డైరెక్టర్, కోచ్ కర్ణం సిందువర్మ వద్ద శిక్షణ పొంది భారత సైన్యం లో ఉద్యోగాలు సాధించిన తొమ్మిది మంది యువకులకు భాస్కరసేవాసమితి ఆధ్వర్యంలో ఘనసన్మానం చేశారు.భాస్కరసేవాసమితి వ్యవస్థాపకఅధ్యక్షుడు, టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ.. సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా కురవి ఎస్ఐ సతీష్, కురవి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బాదావత్ లక్ష్మీరాజునాయక్ లు పాల్గొన్నారు. ఆర్మీ లో ఉద్యోగాలు సాధించిన ఉమేష్, నవీన్, అనిల్, లక్ష్మణ్, దిలీప్, ప్రవీణ్, శ్రీనాథ్, వీరభద్రం, రాఘవ లతోపాటు కోచ్ కర్ణం సింధు వర్మ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురవి ఆలయ మాజీ చైర్మన్ బాదావత్ రాజునాయక్, ఏఎస్ఐ వెంకన్న, భాస్కరసేవాసమితి సలహాదారులు కొణతం విజయ్, సంగెం నాగరాజు, నవీన్, కురవి మాజీ ఉపసర్పంచ్ సంగెం భరత్, వార్డ్ సభ్యులు ప్రమోద్ నాయక్, శీను, కానిస్టేబుల్ నిఖిల్ వర్మ, కాశీరాం, అనిత, ఆర్మీ జవాన్లు ప్రేమ్ కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రముఖ పూజరి బుక్క వీరయ్య కూడా సన్మానించారు.

## సమస్యలు పరిష్కారం ద్వారా

## అధిక స్థానాల్లో గెలవాలి

**టీ మీడియా, జూన్1, ఖమ్మం:** గతంలో ఖమ్మం నగరంలో సమర్థవంతమైన పాలన అందించిన ఘనతసి పీఎం పార్టీకి వుంది అని, ప్రజలకు మరింత చేరువగా వుండటం ద్వారా వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పార్టీ గెలవడానికి చాలా అవకాశాలు ఉన్నాయి అని సి పీఎంపోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు తెలిపారు. సోమవారం సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ ఖమ్మం డివిజన్ వర్క్ షాప్ జిల్లా కమిటీ సభ్యులు భుక్యా శ్రీనువాసురావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోలిట్ బ్యూరో నుంచి బివి రాఘవులు హాజరు అయి క్యాడర్ కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ గా చిర్రావూరి లక్ష్మి నర్సయ్య, ఆతర్వాత కాలంలో మరోసారి మున్సిపల్ చైర్మన్ గా సమీనా అఫ్రోజ్ చిత్తశుద్ధితో నిజాయితీగా, అత్యంత సమర్థవంతంగా పరిపాలన చేశారు అని తెలిపారు. భవిష్యత్ ఖమ్మం నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆనాడే త్రాగు నీరు సౌకర్యం, విశాలంగా రహదారులు, తదితర మౌలిక సదుపాయాలు ఆ కాలంలోనే ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కల్పించారు అని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా ప్రజా సమస్యలు గాలికి వదిలేసి దేశ సంపద అంతా అదానీ, అంబానీ లకు ధారాదత్తం చేసే పనిలో మోడీ బిజీగా ఉన్నారు అని విమర్శించారు. రోజూ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వల్ల ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాలు పడుతున్నాయి అని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనువాసురావు, నాయకులు బండారు రమేష్, దొంగల తిరుపతిరావు,ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో

పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

**ప్రజావాణిలో న కొన్ని దరఖాస్తులు**

చుంచుపల్లి మండలం రాందాస్ తండాకు చెందిన లక్ష్మీబాయి తాను బీఎస్సీ (దీ.నాఎ.) వరకు విద్యాభ్యాసం పూర్తి చేశానని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉన్నందున ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఎండార్స్ చేశారు.అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన ప్రమీల తన భర్తతో కలిసి శారీరక దివ్యాంగులమని, సొంత ఇల్లు లేకపోవడంతో గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం పీడీ, హౌసింగ్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.చుంచుపల్లి మండలానికి చెందిన మాలోతు బద్రు తనకు సర్వే నంబర్ 118/1లో 2 ఎకరాల 20 గుంటల సాగుభూమి ఉన్నప్పటికీ, పట్టాదారు పాసుపుస్తకం 20 గుంటలకు మాత్రమే జారీ అయిందని, మిగిలిన 2 ఎకరాల భూమికి కూడా పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.